ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ	:9985445760
ధర్మవరం, పుట్టపర్తి	: 9963160529
కదిరి	:9052518170

ఏసీఎమ్: 9985411154



వైసీపీ ఐదేళ్ల పాలనతో విసిగి వేసారిపోయిన ప్రజలు కూటమిపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సందర్భంగా ఎక్కడికక్కడ అభ్యర్థులు తమ నియోజక వర్గ ప్రజల ఆకాంక్షల మేరకు హామీలు గుప్పించారు. రోడ్లు, తాగునీటి సమస్యలకు అత్యవసరంగా కొన్ని నిధులు తెచ్చారు. ఇంకా చాలా హామీలు ప్రతిపాదనల దశల్లోనే ఉండిపోయాయి. నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పి వాటిని సాధించేందుకు కృషి చేయాలని ప్రజాప్రతినిధులపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు ఏమాత్రం గళం విప్పుతారో చూడాలి.

గళం విప్పేరా..?

ఎన్నికల్లో భారీగా హామీలు.. కూటమికి అండగా నిలిచిన జనం..

- ప్రతిపాదనల దశలోనే చాలా పనులు
- ఎమ్మెల్యేలపై ప్రజల ఆశలు..
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు

పుట్టపర్తి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడిచాయి. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమికి అధికారమిచ్చారు. హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని ఎదురు చూస్తున్నారు. జిల్లాలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ప్రధానమైనవి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు కియా పరిశ్రమను తీసుకు వచ్చారు. ఎనిమిది నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు అనేక హామీలు ఇచ్చారు. అందరూ గెలిచి ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా పదవులు చేపట్టారు. కొన్ని హామీలను నెరవేర్చినా చాలా వరకు ప్రధానమైన సమస్యలు ప్రతిపాదనల దశలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశాల్లో హామీల పరిష్కారంపై గళం విప్పుతారా అని ఆయా నియోజకవర్గాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. సోమవారం జరిగే అసెంబ్లీ సమావేశాల్లో హామీల కార్యరూపం దాల్చేందుకు బడ్జెట్‌లో అవకాశం ఉంటుందా అని ఆశిస్తున్నారు.

ఉపాధి కల్పన ఏదీ..?



పుట్టపర్తి నియోజక వర్గం నుంచి ఉపాధి కోసం వేల సంఖ్యలో పొరుగు రాష్ట్రానికి వలసలు పెట్టే పరిస్థితి నెలకొంది. నియోజకవర్గంలో పారిశ్రామిక క్లస్టర్లు, గార్మెంట్ పరిశ్రమలు ఏర్పాటుచేసి స్థానికంగా ఉపాధి కల్పిస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారు. నేటికి ఆ హామీలు ప్రతిపాదన దశలోనే ఉండిపోయాయి. కప్పలబండ పారిశ్రామిక వాడలో వంద ఎకరాలకు పైగా భూములు సిద్ధంగా ఉన్నా ఒక్క పరిశ్రమ కూడా ఏర్పాటుకాలేదు. ఉపాధి కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో 193 చెరువులకు నీరిచ్చే ప్రాజెక్టు పనులను ప్రారంభమైనా వేగం పెంచలేదు. పనులు ఎప్పుడు పూర్తవుతాయి, ఎప్పుడు నీళ్లు వస్తాయని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కాగితాల్లోనే చేనేత క్లస్టర్



జిల్లాలో పట్టుకేంద్రంగా ప్రసిద్ధి చెందిన ధర్మవరంలో చేనేత మెగా క్లస్టర్ మంజూరు చేశారు. కానీ, ఇంత వరకూ ముందుకు సాగలేదు. అది కాగితాలకే పరిమితమైంది. గత ఎన్నికల్లో చేనేత క్లస్టర్ ఏర్పాటు హామీని నమ్మి పట్టం కట్టిన చేనేతలు క్లస్టర్ ఎప్పుడని ప్రశ్నిస్తున్నారు. ధర్మవరం పట్టణ సుందరీకరణ హామీ ప్రతిపాదన దశ దాటి ముందుకు వెళ్లలేదు. నియోజకవర్గంలో మెడికల్ ఇంజనీరింగ్ కళాశాల, ప్రతి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటు ఏమయ్యాయని నియోజక వర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హంద్రీనీవా కాలువతో చెరువుల అనుసంధానం హామీ నెరవేరలేదు.

కొత్త పరిశ్రమలేవీ..?



జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి బీజం పడిన హిందూపురంలో కొత్త పరిశ్రమల ఏర్పాటు దిశగా ఊపు రాలేదు. హిందూపురాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చి కొత్త పరిశ్రమలు తీసుకు వచ్చి ఉపాధి కల్పిస్తామని ఎన్నికల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ ఇచ్చారు. 8 నెలల్లో ఏ ఒక్క కొత్త పరిశ్రమ ఏర్పాటుకాలేదు. సాగు నీరు అందించే చిలమత్తూరు ఎత్తిపోతల పథకం డీపీఆర్‌తోనే సరిపెట్టారు. హిందూపురం పట్టణంలో అండర్ డ్రైనేజీ ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. కొత్త పైపులైను ఏర్పాటుకు రూ. 150 కోట్లతో ప్రతిపాదించినా సాంకేతిక అనుమతుల వద్దే నిలిచిపోయింది. సీసీ రోడ్లు, డ్రైనేజీల కోసం చాలా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. లేపాక్షి హబ్ చిక్కుముడి విడిపించి ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటు హామీ ప్రస్తావనకే రాలేదు.

ఉద్యాన హబ్ సాధ్యమయ్యేనా..?



హంద్రీనీవా ద్వారా సాగునీరు తీసుకువచ్చి మడకశిర నియోజకవర్గాన్ని ఉద్యానహబ్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. సాగునీటి కోసం మడకశిర బ్రాంచ్ ఉప కాలువ పనులు పరుగులు పెట్టించలేకపోతున్నారు. గత ఆగస్టులో గుండుమల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వక్క మార్కెట్ మంజూరు చేస్తామని ప్రకటించారు. అమరాపురం మండలం కాచికుంటలో పది ఎకరాల్లో వక్క మార్కెట్ ప్రాసెసింగ్ యూనిట్ కోసం స్థలాన్ని పరిశీలించి అంతటితో సరిపెట్టారు. ప్రాసెసింగ్ యూనిట్ ముందుకు వెళ్లేదెప్పుడని వక్క రైతులు ఎదురుచూస్తున్నారు. ఇటీవల మందుగుండు పరిశ్రమలకు ప్రభుత్వం భూములు కేటాయించింది. సోలార్ పార్కు ఏర్పాటుకు భూములు గుర్తించినా ముందడుగు పడలేదు. హంద్రీనీవా బైపాస్ కెనాల్ ద్వారా మడకశిరకు నేరుగా నీటిని నింపాలన్న లక్ష్యం ప్రతిపాదన దశలోనే ఉంది.

కదిరిలో పారిశ్రామిక అభివృద్ధి జరిగేనా..?



కదిరి నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి అనువైన భూములు ఉన్నాయి. ముత్యాలచెరువు ప్రాంతంలో భూములను గుర్తించినా ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హామీ ఇచ్చారు. పరిశ్రమల కోసం అనువైన భూములు గుర్తించినా ప్రక్రియ వేగం పుంజుకోలేదు. పర్యాటక ప్రసిద్ధి చెందిన ఖాద్రీ నరసింహ స్వామి ఆలయంతో పాటు చుట్టూ ఉన్న పర్యాటక ప్రాంతాలను కలుపుతూ టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి ప్రతిపాదన దశలోనే ఉండిపోయింది. అన్ని చెరువులకు హంద్రీనీవా నీళ్లు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. తలుపుల, ఎన్పీకుంట మండలాలకు నీరిచ్చినా ఇంకా వందలాది చెరువులు ఎదురుచూసే పరిస్థితి. కదిరి-రాయచోటి రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామన్న హామీ కార్యరూపం దాల్చినా... నియోజకవర్గంలో చాలా గ్రామీణ రోడ్ల అభివృద్ధి కోసం ఎదురుచూస్తున్నాయి. పట్టణంలో అండర్ డ్రైనేజీ, చెర్లోపల్లి డ్యాం నుంచి కదిరికి సాగునీరు ఇచ్చే అమృత్ పథకం నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగలేదు.

ఆటో మొబైల్ పరిశ్రమల వేగం పుంజుకునేనా?



రాష్ట్రంలో ఆటోమొబైల్ హబ్‌గా అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్న పెనుకొండలో కియా అనుబంధ సంస్థలకు దీటుగా కొత్త పరిశ్రమలు తీసుకువస్తామని గత ఎన్నికల్లో మంత్రి సవిత ప్రజలకు హామీ ఇచ్చారు. 8 నెలలుగా కొత్త పరిశ్రమల జాడే లేదు. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూములు ఉన్నాయి. కొత్త పరిశ్రమల ఏర్పాటు ఎప్పుడని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యానికి పెద్ద పీటవేస్తున్నా పారిశ్రామిక పర్యాటక రంగం పరుగులు పెట్టేదెన్నడని నియోజకవర్గ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలు, చెరువులకు నీళ్లు ఎప్పుడిస్తారని ప్రజలు అడుగుతున్నారు. సాగునీటి కోసం గోరంట్ల మండల వాసులు ఎదురుచూస్తున్నారు.

అలరించిన అష్టావధానం



అమర్ విద్యామందిరంలో అష్టావధానం నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అమర్ విద్యా మందిరంలో ఆదివారం ఏర్పాటు చేసిన అష్టావధానం అలరించింది. కవి, శతావధాని, అవధాన కళానిధి ఆముదాల మురళి అష్టావధానం చేశారు. గురువేపల్లి నరసింహులు, దత్తపతి వెంకటరాముడు, సమస్య పూరణం రామప్ప, ఆశువు రాఘవేంద్రరావు, పురాణ పఠనం యల్లప్ప, వర్ణన అశ్వత్థనారాయణ, వెస్తాక్షరి ముద్దరంగప్ప, అప్రస్తుత ప్రసంగం కంబదూరు షేక్ నబీరసూల్ గావించారు. వారు అడిగిన ప్రశ్నలకు ఆముదాల మురళి సమాధానాలు చెప్పారు. విద్యామందిరం స్థాపించి 37 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమంలో సిబ్బంది ఇబ్రహీం, ఇలియాజ్, ఆసిఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నమః శివాయ



◄ ప్రశాంతి నిలయంలో యజ్ఞం చేస్తున్న పండితులు, శివలింగానికి అభిషేకం చేస్తున్న పండితుడు ▼



పుట్టపర్తి ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విశ్వశాంతి కోసం చేపట్టిన అతిరుద్ర మహా యజ్ఞం పదోరోజు ఆదివారం కొనసాగింది. స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో రుత్వికులు పదకొండు హోమాలతో యజ్ఞాన్ని కొనసాగించారు. శివనామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. మొదట వినాయకుడికి పూజచేసి, శివలింగానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. యజ్ఞంలో సర్వదేవతార్చన చేశారు. సాయంత్రం ప్రముఖ గాయకుడు అబిషేక్ రఘురాం బృందం కచేరి నిర్వహించింది. యజ్ఞంలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

36 అడుగుల సత్యసాయి చిత్రపటం ఏర్పాటు

స్థానిక చిత్రావతి నది ఒడ్డున 36 అడుగుల ఎత్తైన సత్యసాయి బాబా చిత్రపటాన్ని భక్తులు ఏర్పాటు చేశారు. సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్.. సత్యసాయి చిత్రపటానికి పూజలు చేశారు. భక్తుల సందర్శనార్థం చిత్రపటాన్ని ఏర్పాటు చేశారు.



బోగసముద్రం చెరువులో పవిత్ర జలాలను కలుపుతున్న మంత్రి సవిత

మహాకుంభ్ జలాలతో పుణ్య స్నానాలు

ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సవిత

పెనుకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని బోగసముద్రం చెరువులో ఆదివారం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభ్‌లో గంగ, యమున, సరస్వతి త్రివేణి సంగమం నదుల స్నానాలు చేయలేని భక్తుల కోసం బోగసముద్రం చెరువులో పుణ్యస్నానాలకు అవకాశం కల్పించారు. జలవన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయం నుంచి బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితతో పాటు భారీ ఎత్తున ప్రజలు హాజరై ప్రయాగ్‌రాజ్ నుంచి తెచ్చిన తొమ్మిది నీటి కళశాలను మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణలతో బోగసముద్రం చెరువు వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చెరువులోని మహాధ్యాన యోగేశ్వర మూర్తికి అభిషేకం చేసి ఆ పవిత్ర జలాలను మంత్రి చెరువులో కలిపారు. అనంతరం భక్తులు ఆ నీటిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. వృద్ధులు, చిన్నారులు, వికలాంగుల కోసం ఒడ్డున ఏర్పాటు చేసిన షవర్లతో స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రయాగ్‌రాజ్ కుంభమేళకు వెళ్లలేని వారి కోసం జలవనసంరక్షణ సమితి ఈ విధంగా ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యర్యక్రమంలో జలవన సంరక్షణ సమితి ముఖ్యులు పాపానాయుడు, రమేష్‌రాయల్, రాజశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్, గిరి, చంద్రమౌళి, శ్రీరామ్, పూర్ణా, భాను, వీహెచ్‌పీ ప్రఖండ్ అధ్యక్షుడు వేద వ్యాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, నాయకులు రామక్రిష్ణ, మాధవనాయుడు, త్రివేంద్రనాయుడు, బాను, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ తదితరులు పాల్గొన్నారు.



చెరువులో పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

గంజా గ్రత్త..!

తరలించినా.. తాగినా నిందితులే..

చట్టం కఠినతరం

దొరికితే జైలుకే.. పట్టుబడితే 20 ఏళ్లు కారాగారంలోనే..

హిందూపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నడూలేని విధంగా గంజాయి వినియోగం వైసీపీ హయాంలో పెరిగిందన్నది బహిరంగ రహస్యమే. ఐదేళ్లు గంజాయిని గాలికి వదిలిన పోలీసులు కూటమి ప్రభుత్వం వచ్చాక చర్యలకు ఉపక్రమించారు. గంజాయి రహితంగా మార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. చదువుకునే వయసులోనే యువత పెడదారి పడుతూ మత్తులో జోగుతున్నారు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండు, ఖాళీస్థలాలు, పాడుబడ్డ భవనాల్లో చేరి గంజాయి తాగేవారు. వారి బలహీనతను అదునుగా చేసుకుని కొంతమంది సరఫరాదారులు జేబులు నింపుకున్నారు. కూటమి వచ్చాక గంజాయిపై ఉక్కుపాదం మోపారు. గంజాయితో పట్టుబడితే తరువాత జరిగే పరిణామాలు తెలియక ఎంతోమంది యువత బంగారంలాంటి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు గంజాయి నిర్మూలనకు ఉన్న చట్టాన్ని పూర్తి స్థాయిలో పోలీసులు వినియోగించకపోవడంతో జైలుకు అలావెళ్లి.. ఇలా వచ్చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం 1985లో ఉన్న ఎన్డీపీఎస్ (నార్కొటిక్స్ డ్రగ్స్, సైంటిఫిక్ సబ్‌స్టాండెన్స్) యాక్ట్‌కు పదును పెట్టింది. దీంతో ఎవరైనా గంజాయిలో దొరికితే 20ఏళ్ల నుంచి 30ఏళ్లదాకా శిక్ష పడుతుందని పోలీసులు హెచ్చరిస్తున్నారు.



పట్టుబడితే 20 ఏళ్లు కారాగారంలో..

గంజాయి కేసులో పేరు నమోదైతే ఏళ్ల తరబడి జైలులో మగ్గిపోవాల్సిందే. కొంతమంది తెలిసీతెలియక డ్రగ్స్‌కు బానిసై ఈ ఊబిలో చిక్కుకుంటున్నారు. ఎన్డీపీఎస్ యాక్ట్ ప్రకారం నిందితుడికి బెయిల్ రావడం చాలా కష్టం. అక్రమ రవాణాకు సాయం చేసినా శిక్షార్హులుగానే పరిగణిస్తారు. రెండు అంతకన్నా ఎక్కువ కేసుల్లో దోషులుగా తేలితే 30 ఏళ్లు జైలుశిక్ష విధిస్తారు. 20 కిలోల గంజాయి, అంతకంటే ఎక్కువ సరుకు దొరికితే పదేళ్లకు తక్కువ కాకుండా 20ఏళ్లదాకా జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తారు. కిలో గంజాయి పట్టుబడినా పదేళ్లదాకా జైలుశిక్ష, జరిమానా ఉంటుంది. తక్కువగా దొరికినా కనీసం ఏడాది జైలుశిక్ష అనుభవించాల్సిందే.

వినియోగించినా తప్పదు..

గంజాయితోపాటు ఇతర మత్తుపదార్థాలు వినియోగం కూడా నేరమే. గంజాయి తరలించేవారే కాదు, సేవించేవారికి కూడా శిక్ష ఉంటుంది. కొంతమంది గంజాయి తరలిస్తేనే కేసు నమోదు అవుతుందని భావిస్తున్నారు. వినియోగించేవారికి కూడా వారి వద్ద దొరికేదానిని బట్టి శిక్ష ఉంటుందని పోలీసులు అంటున్నారు. ఇటీవల రవాణాచేసే వారికంటే వినియోగించేవారే అధికంగా పట్టుబడ్డారు. దీనినిబట్టి వీరందరికీ శిక్షలు తప్పవని పోలీసులు పేర్కొంటున్నారు.



కొడికొండ చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన గంజాయి (ఫైల్)

రెండేళ్లలో కేసులు ఇలా..

శ్రీసత్యసాయి జిల్లాలో 2023లో జూన్ నుంచి జనవరి వరకు 11 కేసులు నమోదుచేసి దాదాపు 508 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 88 మందిపై కేసులు నమోదుచేసి, 69 మందిని అరెస్టు చేశారు. 2024 జూన్ నుంచి 2025 జనవరి వరకు 12 కేసులు నమోదుచేసి 26 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 53 మందిని గుర్తించి, 42 మందిని అరెస్టు చేశారు. ఇప్పటి వరకు గంజాయిలో పట్టుబడినవారు అధిక శాతం 30ఏళ్లలోపువారే ఉండటం ఆందోళనకలిగించే అంశం. ఇటీవల హిందూపురం నియోజకవర్గంతోపాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన నేరాల్లో పట్టుబడినవారు గంజాయి మత్తులో ఉన్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీనిని బట్టి గంజాయి ఎలాంటి పరిస్థితికి దారితీస్తుందో అర్థం చేసుకోవచ్చు.



గంజాయికి నిలయాలు

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంజాయి విక్రయాలకు పట్టణంలోని రైల్వేస్టేషన్, కట్టకింద, చిన్నమార్కెట్, పరిగి బస్టాండు ప్రాంతం, గుడ్డం ఏరియా, మోడల్‌కాలనీ, ఆటోనగర్ ప్రాంతాలు కేంద్రాలుగా మారాయి. అక్కడ గంజాయిని విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

హిందూపురం నియోజకవర్గంలో ఏడాదిలో పట్టుబడిన గంజాయి వివరాలిలా..

- గతేడాది విశాఖ నుంచి బెంగళూరు వైపు కంటైనర్‌లో బాక్సులు ఏర్పాటు చేసుకుని, వాటిలో గంజాయి తరలిస్తుండగా చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీచేసి, పట్టుకున్నారు. 500కిలోలకుపైగా పట్టుబడింది. అప్పట్లో వాహనంలో ఉన్నవారిపై మాత్రమే కేసులు నమోదు చేశారు. మూలాలను వదిలేశారు.
- హిందూపురంలో గతేడాది సెప్టెంబరులో తూముకుంట పారిశ్రామిక వాడలో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.
- సెప్టెంబరులోనే రైల్వే స్టేషన్ వద్ద చిన్నప్యాకెట్ రూపంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అక్టోబరులో గంజాయి సేవించి కత్తులతో దాడి చేసుకున్న ఇరువురిపై కేసు నమోదు చేశారు.
- నవంబరులో అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద రెండున్నర కిలోల గంజాయి పట్టుకున్నారు. ఈ ఏడాది జనవరిలో లేపాక్షి పరిధిలో నలుగురు విక్రేతలను అరెస్టు చేసి, వారి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం

గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే జిల్లాలోని ప్రధాన పట్టణాలు, పల్లెల్లో సైతం గంజాయి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ పాఠశాల, కళాశాల మహిళలకు పెద్దఎత్తున అవగాహన కల్పిస్తున్నాం. గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. పోలీసులు సైతం ఆ మేరకు వ్యవహరిస్తున్నారు. గంజాయిలో పట్టుబడితే 20 ఏళ్ల నుంచి 30ఏళ్లదాకా శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. పిల్లలు గంజాయివైపు వెళ్లకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

-రత్న, ఎస్పీ

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పడమటివారిపల్లికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



గ్రామస్థులతో చర్చిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటేశ్వర్లు

తనకల్లు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటివారిపల్లికి ఆదివారం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కదిలారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యపై ఆంధ్రజ్యోతి పత్రికలో ఆదివారం 'కంపునీళ్లే గతి' అన్న శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించారు. గ్రామానికి వెళ్లి నేరుగా బోరునుంచి నీరు వచ్చేలా చర్యలు చేపట్టారు. రానున్న 15 రోజుల్లోపు ట్యాంక్‌కు మరమ్మతులు చేయించి, దాని ద్వారా అన్ని ఇళ్లకు నీరు వెళ్లేలా పైపులైన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. తమ గ్రామానికి వాటర్ ప్లాంటు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరగా ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది రమణారెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రశ్నపత్రాలు వచ్చేశాయ్

కొత్తచెరువు, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు ఓపెన్ స్కూల్ ఇంటర్ ప్రశ్నపత్రాలు ఆదివారం చేరుకున్నాయి. మార్చి 1 నుంచి ఇంటర్ ఫస్టియర్, 3వ తేదీ నుంచి సెకండియర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ నుంచి ప్రత్యేక వాహనంలో ప్రశ్నపత్రాలు పోలీసు మందోబస్తు మధ్య జిల్లాకు వచ్చాయి. వాటిని కొత్తచెరువులోని బాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూంలో విద్యాశాఖాధికారులు భద్రపరిచారు. జిల్లావ్యాప్తంగా ఏడు సెంటర్లలో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ కిష్టప్ప తెలిపారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షల నిర్వహణాధికారి లాజర్, ఏడీ2 రామకృష్ణ, ఏఎస్ఓ చంద్రమోహన్ ఉన్నారు.

హైడ్రామా నడుమ పరీక్షలు

- గ్రూప్-2 మెయిన్స్ రాయడానికి అభ్యర్థుల పరుగులు
- సెంటర్లకు చేరుకోవడానికి నానా పాట్లు
- సమయం దాటిపోయిందని ఓ అభ్యర్థికి నోఎంట్రీ
- 7293 మందికిగాను 6441 మంది హాజరు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-2 మెయిన్స్‌లో కొనసాగిన హైడ్రామాకు ఆదివారం పరీక్షల నిర్వహణతో తెర పడింది. అభ్యర్థుల ఆందోళనలు, కోర్టు విచారణలు, ప్రభుత్వ ప్రకటనల నేపథ్యంలో పరీక్ష నిర్వహణపై శనివారం రాత్రి వరకు సందిగ్ధం కొనసాగింది. అయితే ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణకు గట్టిగా నిర్ణయం తీసుకోవడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. పరీక్షలు సాఫీగా నిర్వహిస్తామని, వదంతులు నమ్మవద్దని కలెక్టర్ ప్రకటించడంతో ఎక్కడెక్కడో ఉన్న అభ్యర్థులంతా రాత్రికి రాత్రే పరీక్షా కేంద్రాలున్న అనంతపురం వైపు పరుగులు పెట్టారు. ఆదివారం ఉదయం కూడా పరీక్ష కేంద్రాలకు హడావుడిగా చేరుకుని హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు.

● 6441మంది హాజరు

గ్రూప్-2 పరీక్షలు ఆదివారం జిల్లాకేంద్రంతోపాటు రూరల్ పరిధిలోని 14కేంద్రాలలో కొనసాగాయి. 7293మంది అభ్యర్థులకుగాను 6441 మంది హాజరై పరీక్షలు రాశారు. హాజరు శాతం 88.31గా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం 10గంటల నుంచి 12-30 వరకు జరిగిన పరీక్షలకు 7293మందికిగాను 6463మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం5-30వరకు జరిగిన పరీక్షకు 6461మంది మాత్రమే హాజరైనట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద భారీ పోలీస్ బందోబస్తు చేపట్టారు. చిన్నపిల్లలతో వచ్చిన తల్లులు, బాలింతలు తమ పిల్లలను కుటుంబసభ్యులు వద్ద వదిలివెళ్లగా ఆపిల్లలను కేంద్రాల వద్ద సముదాయించడం కనిపించింది. పరీక్ష కేంద్రాలను కలెక్టరు వినోద్‌కుమార్, జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ ఇతర జిల్లాశాఖల ఉన్నతాధికారులు తనిఖీలు చేశారు.



ఆర్ట్సు కళాశాలలో అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను పరిశీలిస్తున్న మహిళా పోలీసు

అయ్యో.. పాపం గణేష్

విజయవాడ నుంచి వచ్చినా నోఎంట్రీ



అనంతపురం నగరానికి చెందిన గణేష్ గ్రూప్-2 పరీక్ష రాయాల్సి ఉంది. అయితే రోస్టర్ విషయంలో అన్యాయం జరుగుతోందని, సవరించి పరీక్షలు నిర్వహించాలని జరుగుతున్న ఉద్యమంలో గణేష్ కూడా ఉన్నారు. పరీక్షలు ఆపాలని శనివారం విజయవాడలో చేపట్టిన ఆందోళనలో గణేష్ పాల్గొన్నారు. పరీక్షలు వాయిదా పడే అవకాశం ఉందని ప్రచారం జరగడంతో కొంత నిర్లక్ష్యంగా అక్కడే ఉన్నారు. రాత్రి పరీక్షలు జరుగుతాయనడంతో విజయవాడ నుంచి ప్రత్యేకవాహనాన్ని బాడుగకు తీసుకొని పరీక్ష రాయడానికి అనంతకు వచ్చారు. శారదానగర్‌లోని కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రం వద్దకు చేరుకున్నారు. అప్పటికే 9-50గంటల అయ్యిందని నిబంధనల మేరకు గడువు ముగిసిందని పరీక్ష కేంద్రంలోకి పోలీసులు, ఇతర తనిఖీ అధికారులు అనుమతించలేదు. ఇంకా రెండు నిమిసాలు ఉందని వాదనకు దిగినా వెనక్కి పంపించారు. దీంతో గణేష్ మీడియాతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడేళ్లుగా ప్రిపేర్‌అవుతూ వస్తున్నానని, పరీక్షలు వాయిదా వేయాలని ఏపీపీఎస్సీ వద్ద జరిగిన ఆందోళనలో పాల్గొనడానికి శనివారం విజయవాడ వెళ్లానన్నారు. వాయిదా పడతాయని ప్రచారం జరగడంతో విజయవాడలోనే ఉన్నాన్నారు. పరీక్షలు యథాతథంగా జరుగుతాయని రాత్రికి తెలియడంతో కారును అద్దెకు తీసుకొని వచ్చానని, ఇక్కడ ఇంకా రెండు నిమిషాలు సమయం ఉన్నా లోపలికి అనుమతించలేదని వాపోయాడు. ఈఅన్యాయంపై కోర్టుకు వెళతానని తెలిపారు.

కానిస్టేబుల్ చొరవతో పరీక్ష రాసిన అభ్యర్థి

శ్రీ సత్యసాయి జిల్లా అమడగూరు మండలానికి చెందిన ఆంజనేయులు అనే అభ్యర్థి గ్రూప్-2 పరీక్ష రాయడానికి ఎస్ఎస్‌బీఎన్ కేంద్రానికి వచ్చాడు. పరీక్షకేంద్రంలోకి వెళ్లారు. అక్కడ హాల్‌టిక్కెట్ నెంబర్‌మేరకు పరీక్షహాల్‌ను చూసుకున్నాడు. అయితే అక్కడ తన నెంబర్ ఎక్కడా కనిపించలేదు. ఈ విషయమై అక్కడే ఉన్న అధికారులను అడగగా హాల్‌టిక్కెట్‌ను చూసి, అది గ్రూప్-1 పరీక్ష హాల్‌టిక్కెట్ అని గుర్తించారు. గతంలో కూడా ఇదే సెంటర్‌లో గ్రూప్-1 పరీక్ష రాయడంతో అదే హాల్‌టిక్కెట్‌తో ఇపుడు వచ్చినట్లు గుర్తించారు. అప్పటికి పరీక్షా సమయానికి ఇంకా 12 నిమిషాలు మాత్రమే ఉంది. ఈ విషయం అక్కడే విధుల్లో ఉన్న కానిస్టేబుల్ జాఫర్ తెలుసుకుని, అభ్యర్థి ఆంజనేయులును సమీపంలో ఉన్న ఎస్పీ బంగ్లాకు తీసికెళ్లి అక్కడ ఆన్‌లైన్‌లో గ్రూప్-2 హాల్‌టిక్కెట్ తీయించి గడువులోగా పరుగులు తీయించుకుంటూ పరీక్ష కేంద్రంలోకి పంపించారు.



పరీక్ష కేంద్రంలోకి పరుగులు తీస్తున్న ఆంజనేయులు



పీవీకేకే కళాశాల సెంటర్‌లో గ్రూప్-2 పరీక్షలను పరిశీలిస్తున్న కలెక్టరు వినోద్‌కుమార్



పరుగో.. పరుగు..

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ



పరీక్షకేంద్రంలో ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ జగదీష్ పరిశీలించారు. స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాల, ఆర్ట్స్ కళాశాల, నలంద, ఎస్వీ డిగ్రీ కళాశాల, జేఎన్టీయూ, రైపర్, అనంతలక్ష్మి, కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. బందోబస్తులో ఉన్న పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ్యర్థుల సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాలలోనికి తీసుకెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచే విధంగా చర్యలు చేపట్టారు. ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు గ్రూప్-2 పరీక్షలు కొనసాగాయి.

చెరువులో పడి వ్యక్తి మృతి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠలరాయుని చెరువులో పడి ఆదివారం ఓ వ్యక్తి మృతి చెందాడు. అప్‌గ్రేడ్ స్టేషన్ ఎస్ఐ రమణారెడ్డి, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. కుమ్మవాండ్లపల్లికి చెందిన శ్రీనివాసులు (35) గుజరీ వ్యాపారం చేసుకుని జీవనం సాగిచేవాడు. మనస్పర్థల కారణంగా ఐదేళ్ల క్రితం భార్యతో విడిపోయి, అదే గ్రామంలో ఉన్న చెల్లెలు ఇంటిలో ఉండేవాడు. మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆదివారం విఠాలరాయుని చెరువులో శవమై తేలాడు. అతిగా మద్యం సేవించేవాడని, మద్యం మత్తులో ప్రమాద వశాత్తు చెరువులో పడి మృతిచెంది ఉంటాడని, అతడి చెల్లెలు నందిని ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీ

10 తులాల వెండి ఆభరణాలు, నగదు అపహరణ



అభరణాలు ఎత్తుకెళ్లడంతో బోసిపోయిన విగ్రహం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగిచెర్ల వద్ద ముష్టూరుకు వెళ్లే రహదారిలో వెలసిన వీరముద్దప్పస్వామి, గంగమ్మ ఆలయంలో చోరీ జరిగనట్లు ఆదివారం వెలుగు చూసింది. ఆలయ పూజారి పుల్లన్న తెలిపిన మేరకు.. ప్రతిరోజూ సాయంత్రం ఆలయాన్ని మూసివేసి ఉదయం వచ్చి పూజ కార్యక్రమాలు చేస్తానన్నారు. శనివారం సాయంత్రం పూజలు చేసి వసంతపురంలో ఉన్న తన ఇంటికి వెళ్లానన్నారు. ఆదివారం ఉదయం వచ్చి చూడగానే ఆలయం గేటు తెరిచే ఉండటంతో లోపలికి వెళ్లి చూశానన్నారు. హుండీని పగులగొట్టి అందులో ఉన్న ఆరునెలల నగదు, స్వామికి అలంకరించిన 10 తులాల వెండి ఆభరణాలు అపహరించినట్లు గుర్తించానని తెలిపారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందిచానని పేర్కొన్నారు. రూరల్ పోలీసులు ఆలయం వద్దకు వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో బాలిక మృతి



ప్రీతి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురం తూర్పుబావులకు చెందిన ప్రీతి (8) అనే బాలిక పాముకాటుతో మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుబావులకు చెందిన విశాలాక్షి, రాజశేఖర్ దంపతుల కుమార్తె ప్రీతి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 3వ తరగతి చదువుతోంది. శనివారం రాత్రి ఇంటి ముందు బాలిక ఆడుకుంటుండగా పాము కాటుకు గురైంది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పుట్టపర్తికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. బాలిక మృతితో కుటుంబసభ్యులు తీవ్రవిషాదంలో మునిగిపోయారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి తిరునాళ్ల

స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు.. స్వామి నామస్మరణతో మార్మోగిన ఆలయం



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగుబంగారంగా విరజిల్లుతున్న గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి తిరునాళ్ల నాలుగో ఆదివారం వైభవంగా జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బియ్యం, బేడలు, కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాప్తాడు, రాయదుర్గం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, టీడీపీ సీనియర్ నాయకులు ముంటిమడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, రామలింగారెడ్డి తదితరులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీల్లో నంద్యాల జిల్లా వృషభాలు విజయం సాధించాయి. పోటీలను రాప్తాడు, రాయదుర్గం ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన రెడ్‌మిర్చి పఠాన్ వృషభాలు 3,518 అడుగులు లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గార్లదిన్నెకు చెందిన కుమ్మరి రామాంజనేయులు వృషభాలు 3,513 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. తాడిపత్రి కొండ గోపాల్‌కు చెందిన వృషభాలు 3,485 అడుగులు లాగి మూడో స్థానంలో, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన నాగయ్య వృషభాలు 3,265 అడుగులు లాగి నాల్గవ స్థానం, అనంతపురం టౌన్‌కు చెందిన ఓబుళపతి ఆచారి వృషభాలు 3,158 అడుగులు లాగి ఐదో స్థానంలో, సోములదొడ్డి రామసుబ్బారెడ్డి వృషభాలు 3,121 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచాయి. ఆయా వృషభాల యజమానులకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అశ్వత్థ నారాయణస్వామి తిరునాళ్ల..

పెద్దపప్పూరు, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అశ్వత్థనారాయణస్వామి తిరుణాల ఆదివారం వైభవంగా జరిగింది. మాఘమాసం సందర్భంగా అశ్వత్థనారాయణస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు తలనీలాలు సమర్పించుకొని పుణ్యస్నానాలు చేశారు. ఎలాంటి ఘటనలు జరగకుండా సీఐ వెంకటసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి

తోలుబొమ్మల కళాకారిణికి అవార్డు



కేంద్రమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న దళవాయి శివమ్మ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మల కళాకారిణి దళవాయి శివమ్మకు కేంద్ర ప్రభుత్వ పరంపరాగత్ అవార్డు దక్కింది. హర్యానా రాష్ట్రంలోని సూరజ్‌కుండ్‌లో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఇంటర్నేషనల్ క్రాఫ్ట్ మేళాలో ప్రదర్శనకు ఆమెను ప్రశంసాపత్రంతో సత్కరించారు. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని దళవాయి శివమ్మ అందుకున్నారు.

26న బ్యాడ్మింటన్ టోర్నీ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మెమోరియల్ రాయలసీమ స్థాయి ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఈనెల 26న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గణేష్, సాయితేజ, కిశోర్ తెలిపారు. కల్లూరు ఆర్ఎస్‌లోని శ్రీశిశుమందిరం స్కూలులో సాయంత్రం 4 గంటలకు పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఈనెల 25వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 8247203702, 9398164633, 7013216692 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

శంకర్ నాయక్‌పై చర్యలు తీసుకోవాలి

రామగిరి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్‌పై సమగ్రవిచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములునాయక్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. శంకర్‌నాయక్ తీరు గిరిజన జాతికే అవమానకరమని అన్నారు. విజయవాడలో వ్యభిచార గృహంలో అరెస్టు అయిన శంకర్‌నాయక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఈయన పదవిని అడ్డంపెట్టుకుని పుట్టపర్తిలోని సత్యసాయి ఆసుపత్రికి ఎదురుగా ఒక అమాయక గిరిజనుడిని బెదిరించి స్థలాన్ని కబ్జాచేశాడని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అనేక మందిని మోసం చేశాడని, అక్రమాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలు లైవ్ స్ట్రీమింగ్ : ఆర్ఐఓ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో అన్నిగదుల్లో సీసీల లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ తెలిపారు. ఆదివారం ఇంటర్ పబ్లిక్ పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లతో ఒకేషనల్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఆర్ఐఓ మాట్లాడుతూ... పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. 63 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుంటే లైవ్ స్ట్రీమింగ్ ఉంటుందని నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. పరీక్షాకేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం అన్నారు. ఫొటో గుర్తింపు కార్డు తప్పనిసరిగా ధరించాలన్నారు. పరీక్ష సిబ్బంది, ఇతర స్టాఫ్‌ను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే కేంద్రాలోకి అనుమతించాలని ఆదేశించారు. కేంద్రాల్లో తగినంత వెలుతురు, తాగునీరు, ఫ్యాన్లు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు సాలాబాయి, నాగరత్నమ్మ, సుభద్రమ్మ, రంగయ్య పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో చేపట్టిన పారిశుధ్యం ప్రత్యేక డ్రైవ్‌కు అనూహ్య స్పందన లభించిందని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజనాయుడు పేర్కొన్నారు. జిల్లాలోని 575 పంచాయతీల్లో ఆదివారం చెత్త సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇళ్ల నుంచి చెత్తను సేకరించి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టినల్లు తెలిపారు. ఇదే తరహాలో తరచూ స్థానిక సిబ్బంది పారిశుధ్య చర్యలు కొనసాగించేలా స్థానిక ఈఓఆర్డీలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలోని మూడు మండలాల్లో జరుగుతున్న పారిశుధ్యం ప్రత్యేక డ్రైవ్‌ను డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం పరిశీలించినట్లు తెలిపారు. నార్పల మండలంలోని నాయనపల్లి, తాడిపత్రి మండలం భోగసముద్రం, పుట్లూరు మండలం కందికాపుల పంచాయతీల్లో తనిఖీలు చేపట్టి, సిబ్బందికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు.

ఇద్దరు అమ్మాయిలతో..

- ఓ అబ్బాయి ప్రేమాయణం
- ఒకరికి తెలియకుండా మరొకరితో..
- మోసంపై నిలదీసిన యువతులు
- విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం
- ఒకరు మృతి.. మరొకరు ఆస్పత్రి పాలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): ఇద్దరు అమ్మాయిలు ఒకరికి తెలియకుండా మరొకరు ఒకే అబ్బాయిని ప్రేమించారు. అయితే కొన్నాళ్లకు తామిద్దరూ ప్రేమిస్తున్నది ఒక్కరినే అని తెలుసుకుని తల్లడిల్లిపోయారు. మోసం చేస్తున్నావని యువకున్ని నిలదీశారు. వాదులాడారు. చివరకు ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

ఒకరిది స్కూల్ ప్రేమ... మరొకరిది కాలేజీ ప్రేమ..

శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం గరిశనపల్లికి చెందిన దివాకర్, ముదిగుబ్బ మండల కేంద్రానికి చెందిన రేష్మ చిన్నప్పుడు ఒకే స్కూల్‌లో చదువుకున్నారు. అప్పటి నుంచి కొనసాగిన పరిచయం తర్వాత ప్రేమగా మారింది. అయితే రేష్మకు రెండేళ్ల కిందట పెళ్లయింది. కొంత కాలానికే భర్తతో కొట్లాడి వదిలేసింది. ప్రస్తుతం పుట్టింట్లో ఉంటోంది. దివాకర్ ప్రస్తుతం బళ్లారి రోడ్డులోని కేబీఎఫ్ ఫైనాన్స్‌లో పని చేస్తున్నాడు. ఆ క్రమంలో మళ్లీ దివాకర్‌తో టచ్‌లోకి వచ్చింది. మళ్లీ ప్రేమకథ ప్రారంభమైంది. మరోవైపు కణేకల్లు మండలం యర్రగుంటకు చెందిన శారద(21)నగరంలోని నలంద కళాశాలలో డిగ్రీ ఫైనలియర్ చదువుతోంది. ఆదిమూర్తినగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటోంది. కంప్యూటర్ కోర్స్ కోసం ఓ ఇన్‌స్టిట్యూట్‌కు వెళ్లేది. అక్కడికి దివాకర్ సోదరి కూడా వెళ్లేది. ఈక్రమంలో వారిద్దరికి స్నేహం ఏర్పడింది. సోదరి ద్వారా దివాకర్‌కు శారద పరిచయమైంది. అది ప్రేమకు దారి తీసింది. అలా దివాకర్ ఒకరికి తెలియకుండా మరొకరితో ప్రేమాయణం నడిపాడు.

ఇన్‌స్టాగ్రామ్‌తో తెలిసింది...

దివాకర్‌ను ప్రేమించే ఆ ఇద్దరు యువతులు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒకరికొకరు పరిచయమయ్యారు. అలా ఇద్దరూ రకరకాల ఊసులు చెప్పుకున్నారు. చివరికి బాయ్‌ఫ్రెండ్ గురించి కూడా చెప్పుకుని, అతడి ఫొటో షేర్ చేసుకున్నారు. ఫొటో చూసుకుని ఇద్దరూ ఖంగుతిన్నారు. ఇదంతా రెండు మూడు నెలల కిందట జరిగింది. అప్పటి నుంచి ఇద్దరూ తాము మోసపోయామనుకున్నారు. అతడితో గొడవ పడుతూ వచ్చారు. ఆ సమస్యను ఎవరికీ చెప్పుకోలేక, అతడితో విభేదించలేక వాదులాడుతూ వచ్చారు.

పెళ్లి కోసం గొడవ పడి..

రెండు రోజుల కిందట రేష్మ కుటుంబసభ్యులతో గొడవపడి బయటకు వచ్చింది. శనివారం రాత్రి శారద వద్దకు వెళ్లింది. అదే రోజు రాత్రి ఇద్దరూ దివాకర్‌కు ఫోన్ చేశారు. 'మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి...నాకు అవసరం లేదు'అని అతడు అన్నట్లు సమాచారం. దీంతో ఇద్దరూ మనోవేదన చెంది ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకున్నారు. హాస్టల్ నుంచి శారద, రేష్మలు జీసస్‌నగర్‌లో నివాసముంటున్న దివాకర్ గది వద్దకు ఆదివారం ఉదయం వెళ్లారు. చివరగా తమ ప్రేమ గురించి వాదించారు. ఇద్దరినీ ప్రేమించి మోసం చేస్తావా..?అంటూ నిలదీశారు. నన్ను టెన్షన్ పెట్టకండి వదిలేయండి అన్నాడు. పెళ్లి చేసుకోమని కోరారు. దీంతో దివాకర్ మీవాళ్లతో మాట్లాడండి అన్నాడు. వారు వారి వాళ్లకు ఫోన్ చేయకుండా అక్కడి నుంచి బయటకెళ్లారు. ఇద్దరూ కురులకు వాడే ద్రావకం బాటిళ్లు రెండు తీసుకుని ఆర్టీఓ కార్యాలయం సమీపంలోకి వెళ్లారు. 10.30గంటల సమయంలో తాము విషద్రావకం తాగామని దివాకర్‌కు ఫోన్ చేసి చెప్పారు. దీంతో ఆందోళన చెందిన దివాకర్ ఎక్కడున్నారని అడిగితే తొలుత చెప్పకపోయినా, తర్వాత కాసేపటికి చెప్పారు. దీంతో దివాకర్ అక్కడికి వెళ్లాడు. అప్పటికే శారద అపస్మారక స్థితిలో ఉంది. ఇద్దరినీ చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో...వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆసుపత్రికి తీసుకెళ్లిన కొంతసేపటికే శారద మృతి చెందింది. రేష్మ చికిత్స పొందుతోంది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. దివాకర్‌ను విచారిస్తున్నారు.



దివాకర్

ఉమ్మడి జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఉమ్మడి అనంత జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. స్థానిక అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్రనాయకుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా ఎక్సైజ్ సీఐ జయనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎక్సైజ్ ఎస్ఐ సయ్యద్ జాకీర్ హుస్సేన్‌లను ఎంపిక చేశారు. అలాగే అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నరేష్‌బాబు, ఉపాధ్యక్షుడిగా సృజన్ బాబు, కార్యనిర్వాహక కార్యదర్శిగా శివసాగర్, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా జయనరసింహ, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సునంద, రామ్మోహన్, గురునాథ్‌రెడ్డి, సోమశేఖర్, ఉమామనోహర్ రాజు, బీమప్ప, పృథ్విరాజ్, రాజేంద్రప్రసాద్, సత్యనారాయణలను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం సభ్యులకు ఆ శాఖ అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.

జీవితాల్లోంచే కథలు పుడతాయి

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్



మాట్లాడుతున్న సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'కథలు ఎక్కడి నుంచో కాదనీ, మనతోపాటు మన చుట్టుపక్కలవారి జీవితాల్లోంచే దొరుకుతాయ'ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ పేర్కొన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక లలితకళాపరిషత్ మినీహాల్‌లో నిర్వహించిన అనంత కథా కార్యశాలకు కెంగార మోహన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునికుడు నేల నుంచి నీటిని పిండుతున్నాడనీ, ఖనిజాలు తవ్వుతున్నాడని, అభివృద్ధి పేరుతో చేసే విధ్వంసాలు మామూలువి కాదన్నారు. ఈ కోణంలో కథలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీనియర్ రచయిత సింగమనేని నారాయణ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి నేతలు అంకె శ్రీనివాస్, ప్రజ్ఞా సురేష్, యమునారాణి, రచయిత్రి శశికళ, డాక్టర్ ప్రగతి, శ్రీనివాసమూర్తి, సాహితీకారులు ఉప్పరపాటి వెంకటేశులు, రాజారామ్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

బంగారం కొనబడును



మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA- 226835

గాయత్రి జ్యోతిష్యం

పండిట్ ఎస్.వి.శాస్త్రిగారు 50సం॥లుగా ఆంధ్ర, కర్నాటకలో ప్రసిద్ధి చెందినారు. విద్య, స్త్రీ పురుష ప్రేమ, లగ్నం, సంతానం, స్త్రీ పురుష వశీకరణ, వ్యాపార ఆర్థిక కుటుంబ సమస్యలకు సంప్ర:9440532926

AJA-226818

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రేపు విద్యుత్ అదాలత్

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కదిరి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మంగళవారం స్థానిక విద్యుత్ కార్యాయంలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోసెస్ తెలిపారు. వినియోగదారులు తమ ఫిర్యాదులను ప్రత్యేక అదాలత్‌తో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు. దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించడానికి ఇది మంచి అవకాశమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి అదాలత్ ఛైర్మన్ శ్రీనివాసాంజనేయమూర్తి హాజరవుతారని తెలిపారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బత్తలపల్లి మండలం తంబాపురం వాటర్‌ప్లాంట్‌లో అగ్నిప్రమాదం జరగడం వల్ల విద్యుత్‌లైన్లు పూర్తిగా కాలిపోయాయని, సోమ, మంగళవారాల్లో పట్టణానికి నీటి సరఫరా ఉండబోదని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

రేపటి నుంచి శివరాత్రి ఉత్సవాలు

తిమ్మమాంబ రథోత్సవంతో ప్రారంభం
జాగరణకు భారీ ఏర్పాట్లు

నంబులపూలకుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): తిమ్మమ్మ మర్రిమాను ఉన్న మండలంలోని గూటిబైలు గ్రామంలో ఏటా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు మంగళవారం అమ్మవారి రథోత్సవంతో ప్రారంభమవుతాయి. ఈ ప్రాంతంలో మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. వివిధ ప్రాంతాలతో పాటు సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. మహాశివరాత్రి రోజును అమ్మవారి సన్నిధిలో జాగరణచేస్తే వారికి మేలు జరుగుతుందని భక్తుల నమ్మకం. బుధవారం మహాశివరాత్రి జాగరణ సందర్భంగా అమ్మవారు ప్రత్యేకాలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి తిమ్మమాంబ జీవిత చరిత్ర బురకథ రూపంలో వినిపిస్తారు. ఈ కథను వినడానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. గురువారం మొక్కులు తీర్చుకుని ఆరాత్రి బస చేస్తారు. ఆరోజుకూడా బురకథ ఉంటుంది. ఈ యేడాది శివరాత్రికి హోటల్ నిర్వాహణతో పాటు, ఏర్పాట్లు కూడా చాలా అంగరంగవైభవంగా చేస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

● చూడదగిన ప్రదేశాలు: తిమ్మమ్మ, బాలవీరయ్యల దర్శనాంతరం తిమ్మమాంబ సతీసహగనం చేసిన ప్రదేశంలో తిమ్మమ్మ ఘాట్, తిమ్మమ్మ కోట, శివప్రాజెక్టు, ఓబుళదేవర గుట్టలో వెలసిన గణపతి, లక్ష్మీనరసింహస్వామి, కనకదుర్గమ్మ, కైవారంతాత, అయ్యప్పస్వామి,వెంకటేశ్వరస్వామి ఆలయలను భక్తులు దర్శించుకోవచ్చు.

● ఇలా వెళ్లాలి..: కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి మీదుగా, పుట్టపర్తి జిల్లాలోని తనకల్లు మండలంలోని కొక్కంటి క్రాస్ మీదుగా మర్రిమానుకు చేరుకోవచ్చు. ఉమ్మడి కడప జిల్లా వాసులు అన్నమయ్య జిల్లా కేంద్రానికి చేరుకుని గాండ్లపెంట మండలంలోని రెక్కమాను మీదుగా మర్రిమానుకు చేరుకోవచ్చు. ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులు కదిరి వచ్చి గాండ్లపెంట మండలంలోని రెక్కమాను మీదుగా మర్రిమాను చేరుకోవచ్చు.


ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిమ్మమ్మ మర్రిమాను


తిమ్మమాంబ అమ్మవారు


తిమ్మమ్మ ఘాట్

పెద్దమ్మతల్లి జాతరకు ఏర్పాట్లు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక పాతూరులో వెలసిన గ్రామదేవత పెద్దమ్మతల్లికి శివరాత్రిని పురష్కరించుకొని జాతర నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తామని ఆ ఆలయ కమిటీ సభ్యుడు అన్నమనేని దామోదర్ నాయుడు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రామ పెద్దల సహకారంతో అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామన్నారు. ఈ ఉత్సవాలకు మండలం నుండే కాకుండా కడప, అనంతపురం, కర్ణాటక, తెలంగాణా ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. మొదటి రోజైన బుధవారం మహాశివరాత్రి రోజు అమ్మవారిని వెండి ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, పల్లకిలో తెల్లవారుజాము వరకు ఊరేగిస్తారు. రెండో రోజైన గురువారం రోజు తెల్లవారుజామున పాతవూరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండోళ్ళ బావి వద్ద వెలసిన నల్లలమ్మ గద్దె మీద పెద్దమ్మ తల్లి పల్లకి ఉంచి, అమ్మవారికి పొట్టేళ్ళు, మేకలు, కోళ్ళు సమర్పిస్తారు. మహిళలు అమ్మవారికి చీరలు, గాజులు, ఒడిబియ్యం సమర్పిస్తారు. మూడో రోజైన శుక్రవారం యథాస్థానంలో పెద్దమ్మతల్లిని ఉంచి ఆలయ ఆవరణంలో జాతరను నిర్వహిస్తారు. జాతర చివరి రోజున ఆలయ ప్రాంగణంలో గాజులు, ఆటబొమ్మల దుకాణాలు భారీ సంఖ్యలో ఏర్పాటు చేస్తారు. భక్తులు పొట్టేళ్ల, మేకలు, కోళ్ళు అమ్మవారికి సమర్పించినా.. పెద్దమ్మతల్లికి మాత్రం బెల్లం పొంగలినే నైవేద్యంగా పెట్టడం ఇక్కడి ఆనవాయితీ.


అలంకరణలో పెద్దమ్మ తల్లి

రైతు సమస్యలపై నేడు నిరసన

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలు పరిష్కరించాలని సోమవారం సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు సీపీఎం నేత, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న తెలిపారు. ఆదివారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో అందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేసిన ఆయన మాట్లాడారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరతో పాటు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. హంద్రీనీవా కాలువలను వెడల్పు చేస్తూ అన్ని చెరువులకు నీరు సరఫరా చేయాలన్నారు. గ్రీన్ ఎనర్జీకారిడార్ పేరిట సేకరిస్తున్న రైతుల భూములను నిలుపుదల చేయాలన్నారు. రైతు సమస్యలపై వచ్చేనెల 3న తహసీల్దార్ కార్యాలయాల వద్ద కూడా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, వెంకటస్వామి, ఎల్ ఆదినారాయణ, హైదర్‌వలి పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఏర్పాటు


బీజేపీ మండల కమిటీ నూతన సభ్యులు

తనకల్లు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ప్రధాన క్యాదర్శులుగా సురేంద్ర, జయచంద్ర, ఉపాధ్యక్షులుగా ఆంజనేయులు, శంకర్‌రెడ్డి, వెంకటరాయప్ప, విద్యాసాగర్‌రెడ్డి, కార్యదర్శులుగా వెంకటరమణ, భారతి, జానకిరామ్, కారుకూరి, కోశాధికారిగా జనకిరామ్, కార్యవర్గ సభ్యులుగా పాపిరెడ్డి, యల్లప్పను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు హసనాపురం చంటి, మండలాధ్యక్షుడు బాబురెడ్డి, జిల్లా గిరిజన మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మండల మాజీ అధ్యక్షుడు రాజన్న, మైనార్టీ ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆసక్తిగా క్రికెట్ పోటీలు


విజేత జట్టును అభినందిస్తున్న సీనియర్ క్రికెటర్లు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలు ఆసక్తిగా జరిగాయి. ఆర్డీటీ కోచింగ్ క్యాంపు జట్టు, కదిరి క్రికెట్ క్లబ్ జట్ల మధ్య జరిగిన పోటీల్లో కదిరి క్రికెట్‌క్లబ్ జట్టు విజయం సాధించినట్లు క్రికెట్ కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన కోచింగ్ క్యాంపు జట్టు 124 పరుగులు చేసింది. కెప్టెన్ తరుణ్ 65 పరుగులు చేశాడు. తరువాత బ్యాటింగ్ చేసిన కదిరి క్రికెట్ క్లబ్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 14 ఓవర్లతోనే విజయం సాధించింది. వీరిలో షాకీర్ 87 పరుగులు చేశారు. విజయం సాధించిన జట్టును సీనియర్ క్రీడాకారులు యల్లప్ప, విజయ్, ముబారక్ అభినందించారు.

గీతామందిరంలో వైద్య పరీక్షలు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడేపల్లి గీతామందిరంలో ఏకల్ ఆరోగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఆస్టర్ వైద్యశాల వైద్యులు కిరణ్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 94 మందికి పరీక్షలు నిర్వహించి.. 34 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి ఉచితంగా కంటి అద్దాలు అందచేస్తామన్నారు.

రెండు గ్రామాల్లో పోలీసుల సోదాలు


చిల్లవారిపల్లిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ

తాడిమర్రి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో ఆదివారం పోలీసులు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈనెల 26, 27 తేదీల్లో జరిగే కాటకోటేశ్వర జాతర నేపథ్యంలో చిల్లవారిపల్లి, చిల్లకొండయ్యపల్లి గ్రామాల్లో ఒకేసారి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఇందులో తాడిమర్రి ఎస్ఐ క్రిష్ణవేణి, ధర్మవరం రూరల్, బత్తలపల్లి, పట్నం ఎస్ఐలు శ్రీనివాసులు, సోమశేఖర్, రాజేశేఖర్, ధర్మవరం సబ్‌డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద చెత్త దిబ్బ


ఓడీసీ ఉర్దూ పాఠశాల వద్ద నిల్వ ఉన్న చెత్త

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఉర్దూ పాఠశాల వద్ద చెత్త దిబ్బ పేరుకుపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల పక్కనే పెద్ద పాటి చెత్త దిబ్బ ఉండడంతో దోమలు కూడా అధికమయ్యాయి. దీనిపై పలు మార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆ ప్రాంత వాసులు వాపోతున్నారు.

చెత్త సమస్య పరిష్కరించండి

కొత్తచెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లకుంట క్రాస్ రైల్వే స్టేషన్ ఎదురుగా కొత్తగా ఏర్పడిన కాలనీ వాసులు చెత్త సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు కొత్తగా ఇళ్లు నిర్మించుకోవడంతో ఈ కాలనీ ఏర్పడింది. కొత్తచెరువులో సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయకుండా పంచాయతీ సిబ్బంది ఈ కాలనీకి సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో ట్రాక్టర్లలో తీసుకు వచ్చి వేస్తున్నారు. ఆ చెత్త పేరుకుపోయి కుళ్లి దుర్వాసన వస్తోందని, దోమలు, ఈగలు అధికమై రోగాలు పాలు అవుతున్నామని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. అంతేకాకుండా ఆ చెత్తకు నిప్పుపెడుతుండటంతో భారీగా పొగ వస్తోందని, ఆ పొగ ఘాటుకు తట్టుకోలేకపోతున్నామని, కళ్లు మండుతున్నాయని వాపోతున్నారు. నిప్పురవ్వలు కూడా గాలిలో ఎగిరి వచ్చి ఇళ్లలోని సోఫాలు, బట్టలపై పడుతుండటంతో.. అవి కాలుపోతున్నాయన్నారు. ఈ పొగ సమీపంలోని కొత్తచెరువు నుంచి పుట్టపర్తికి వెళ్లే ప్రధాన రహదారి వైపు వెళ్తుండగా.. అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పొగ కారణంగా ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక పోవడంతో వాహనాలు ఢీకొని ఆస్పత్రులు పాలవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్తను డంపింగ్ యార్డులో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ వాసులు కోరుతున్నారు.


చెత్తకు నిప్పుపెట్టడంతో దట్టంగా వస్తున్న పొగ


బోసిపోయిన కదిరి-హిందూపురం రహదారి

అప్పుడే ఎండలు భగ.. భగ..

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభంలోనే ఎండలు మండుతున్నాయి. ఇప్పుడే ఎండలు ఇలా విపరీతంగా ఉండడంతో మునుముందు ఎండలు ఎలా ఉంటాయో అని ప్రజలు భయపడుతున్నారు. ఆదివారం విపరీతమైన ఎండ ఉండడంతో వీధులన్నీ నిర్మానుషంగా కనిపించాయి.

శ్రీహరి సత్సంగ సమితి సమావేశం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేపల్లి గీతామందిరిలో ఆదివారం ఏకల్ అభియాన్ ఆంధ్రప్రదేశ్ శ్రీహరి సత్సంగ కార్యకర్తల సమితి గ్రామ భజన సమావేశం నిర్వహించారు. కదిరి ఆచల్ సమితి అధ్యక్షుడు రాధక్రిష్ణ మాట్లాడుతూ గ్రామ సమితి కార్యకర్తలు చేయాల్సిన పనులను వివరించారు. కార్యక్రమంలో ఓడీసీ సత్‌సవితి అధ్యక్షుడు క్రిష్ణమూర్తి, దక్షణాంధ్ర అభియాన్ ప్రముఖ్ తిరుపాల్, పిసంస్కార్ సహదేవుడు, సుబ్బరాయుడు, గ్రామ కమిటీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం

నంబులపూలకుంట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్‌నగర్‌కు వెళ్లే రహదారి పక్కనున్న ఓ దుకాణం వద్ద విద్యుత్ ప్రమాదం పొంచి ఉంది. దుకాణం వద్ద ఓ చెట్టు కొమ్మలు విద్యుత్ 11 కేవీ వైర్లను తగులుతుండటంతో స్థానికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం వీచిన గాలికి వైర్ల నుంచి నిప్పు రవ్వలు రావడంతో ఆ చెట్టు ఆకులకు అంటుకున్నాయి. ఆ తర్వాత ఆ మంటలు ఆరిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పెను ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


చెట్టు కొమ్మల సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు

నేత్రదాత కుటుంబ సభ్యులకు సన్మానం


నేత్రదాత కుటుంబసభ్యులను సన్మానిస్తున్న సభ్యులు

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక రాంనగర్‌కు చెందిన రామాంజనేయులు ఈనెల 10న గుండెపోటుతో మరణించాడు. ఆయన కుటుంబసభ్యులు నేత్రదానానికి సహకరించారు. దీంతో రామాంజనేయులు కుమారుడు జగదీష్, కోడలు నటరాణిని విశ్వదీప సేవాసంఘం సభ్యుడు, ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్ రెడ్డి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ కుళ్లాయప్ప, కంటిరెట్రావైల్ సెంటర్ ఛైర్మన్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, ఐకేర్ ఆసుపత్రి డాక్టర్ జగన్‌మోహన్, వైద్యులు నరసింహులు,మోహన్‌కృష్ణసన్మానించారు.

నిపుణుల కమిటీని నియమించండి


సాంస్కృతిక వ్యవహారాలశాఖ సంచాలకుడు మల్లికార్జునకు వినతి పత్రం ఇస్తున్న మైనాస్వామి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ సముదాయానికి యునెస్కో వారసత్వ కట్టడాల జాబితాలో శాశ్వత చోటు సంపాదించడానికి నిపుణుల కమిటీ నియమించాలని రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ సంచాలకుడు డాక్టర్ మల్లికార్జునకు వినతి పత్రం అందచేసినట్లు చరిత్రకారుడు మైనాస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయ సముదాయాన్ని యునెస్కో వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు 2023 మార్చి 30న ప్రకటించందన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆలయంలోని నిర్మాణ విశేషాలు, అత్యున్నత శిల్పసంపద, తైలవర్ణ చిత్రాలు, ప్రపంచంలోనే పెద్దదైన ఏకశిల రాతి నందివిగ్రహం వంటి విషయాలపై సమగ్ర అధ్యయనం చేసి నివేదికను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు తెలిపారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నిరుపేదలు ఇళ్ల కోసం మార్చి 10లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ పొలప్ప తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి ప్రారంభమైందని, గ్రామాల్లో తాగునీటి, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, జడ్పీటీసీ రాధబాయి, సీఎస్‌డీటీ రవిప్రసాద్, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయం

బుక్కపట్నం, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన శివాలయంలో శివరాత్రి సందర్భంగా ఈనెల 25 నుంచి 27 వరకు ద్వాదశ జ్యోతిలింగాల దర్శనానికి నమూనాలను ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులు గోపి మాట్లాడుతూ 26న కైలాసగిరి దర్శనం, 27న లక్షదీపోత్సవం నిర్వహిస్తున్నామని, ప్రజలందరూ పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

పేరుకే గొప్ప..!

ఇలా వీధుల్లోనే మురుగునీరు పారుతున్న ప్రాంతాలు ఎక్కడో మారుమూల గ్రామంలోనివి అనుకుంటే మీరు పొరబడినట్లే. ఈ వీధులు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన.. జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోనివి. పుట్టపర్తి ఎనుములపల్లిలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో పరిస్థితి ఇది. సైడ్ కాలువలు లేకపోవడంతో ఇలా వీధుల మధ్యలోనే మురుగునీరు పారుతోంది. ఈ నీరు నిత్యం ఇలా పారుతుండటంతో అనేకమంది జారి పడి.. గాయపడ్డారు. అంతేకాకుండా దోమలూ భారీగా పెరగడంతో.. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అభివృద్ధిని కేవలం ప్రకటనలు.. సమావేశాలు.. చర్చలకే పరిమితం చేస్తున్నారు.

- ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుట్టపర్తిలో డ్రైనేజీ సమస్య
- కాలువలను తలపిస్తున్న వీధులు
- రోగాల బారిన ప్రజలు
- జిల్లా కేంద్రమైనా మారని పరిస్థితి
- ప్రకటనలకే పరిమితమైన అధికారులు
- భూగర్భడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు ఎప్పుడో..?


పుట్టపర్తి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎనుములపల్లిలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో రోడ్లపై మురుగునీరు నిత్యం పారుతూనే ఉంటాయి. దీంతో ఈ రోడ్లు కాస్త కాలువలను తలపిస్తున్నాయి. వీధుల్లో సీసీ రోడ్డు వేసినా.. మురుగు కాలువలను ఏర్పాటు చేయకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ కాలనీల్లో నిత్యం ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి మురుగునీరు రోడ్లపై ఇలా పారుతున్నాయి. దీనిపై స్థానికులు అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా.. ఫలితం శూన్యం.

● భూగర్భ డ్రైనేజీ లేక : పాతిక సంవత్సరాల క్రితమే పట్టణంలో భూగర్భడ్రైనేజీ వ్యవస్థను తీసుకువచ్చారు. అయితే అది కేవలం పుట్టపర్తి, గోకులం, ప్రశాంతి గ్రామాలకు మాత్రమే పరిమితం చేశారు. మిగిలిన ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేయకపోవడం సమస్యగా మారింది. ముఖ్యంగా ఎనుములపల్లి, బ్రాహ్మణపల్లి, కర్ణాటక నాగేపల్లి ప్రాంతాల్లో డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్లపైనే మురుగునీరు పారుతూ ఉంటుంది. గుంతల్లో ఈ నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది.



బీసీ, ఎస్సీ కాలనీల్లోని వీధుల్లో పారుతున్న మురుగునీరు


రోగాల బారిన పడుతున్నాం



ఎగువ ప్రాంతంలోని వృథా నీరు మా ఇంటి ముందు చేరి నిల్వ ఉంటోంది. దోమలు అధికమయ్యాయి. ఈ ప్రాంతంలోని వాళ్లకు రోగాల భయం పట్టుకుంది. సైడు కాలువలు ఏర్పాటు చేయాలని అధికారులను కోరినా ఫలితం లేకుండా పోయింది.

-ఓబుళమ్మ, ఎస్సీ కాలనీ, ఎనుములపల్లి

భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి



భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేయడమే.. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం. కూటమి ప్రభుత్వంలో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేస్తారనే ఆశ ఉంది. ఆ దిశగా ప్రజా ప్రతినిధులు, అధికారులు సమస్యకు పరిష్కారం చూపాలి.

-కట్టా సరోజమ్మ, బీసీ కాలనీ, ఎనుములపల్లి

ప్రతిపాదనలు పంపాం

రోడ్లపై బట్టలు ఉతకడం, పాత్రలు కడగటంతో మురుగు నీరంతగా ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి చేరుకుని నిల్వ ఉంటోంది. రోడ్లపై మురుగునీరు పారవేయరాదని ప్రజలను హెచ్చరించినా పట్టించుకోవడంలేదు. ఇక నోటీసులు జారీ చేస్తాం. భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం.

-ప్రహల్లాద, మున్సిపల్ కమిషనర్, పుట్టపర్తి

శిథిలావస్థలో ఆసుపత్రి క్వార్టర్స్

● ఆర్ఎంఓ, డాక్టర్లు అక్కడే ఉండాలి

● బయట అద్దె ఇళ్లలో నివాసంతో రోగులకు ఇబ్బందులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సేవలో అత్యవసర వైద్యసేవల విభాగం వైద్యులు, సిబ్బంది 24 గంటలకు రోగులకు అందుబాటులో ఉండాలి. అందుకోసం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి అయిన హిందూపురంలో కొన్నేళ్ళ క్రితమే వైద్యులకు, క్లాస్-4, క్లాస్-3 సిబ్బందికి క్వార్టర్లను నిర్మించారు. అయితే అందులో ఎవరూ ఉండటంలేదు. క్వార్టర్లు కూడా పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం ఒక ఆర్ఎంఓ క్వార్టర్, క్లాస్4కు చెందిన నాలుగు, క్లాస్ -3కి చెందిన రెండు క్వార్టర్లు ఉన్నా అవి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. దీంతో ఇదే మంచి తరుణం అన్నట్లుగా వైద్యులు సిబ్బంది బయటే నివాసముంటున్నారు. ప్రస్తుతం ఆ క్వార్టర్లలో ఆసుపత్రిలో జరుగుతున్న సివిల్ పనులుచేసే కార్మికులు ఉంటున్నారు. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతి రోజు వేల సంఖ్యలో వివిధ వ్యాధులతో రోగులు వస్తుంటారు. వారికి సేవలు అందించేందుకు



క్వార్టర్లలో నిర్మాణ కార్మికులు ఉంటున్న దృశ్యం

వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండాల్సి ఉండగా, క్వార్టర్లు శిథిలావస్థకు చేరడంతో ఎవరూ అక్కడ ఉండటంలేదు. దీంతో వైద్యసేవలు అంతంత మాత్రమే అందుతున్నాయి. కొంత కాలం క్రితమే క్వార్టర్లను కండెమ్‌నేషన్ కమిటీ పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపింది. ఎన్నో ఏళ్ల పూర్తయిన వాటిని కూలగొట్టి వాటి స్థానంలో కొత్త క్వార్టర్లు



కూలడానికి సిద్ధంగా ఉన్న భవనాలు ఇవే

నిర్మించాల్సి ఉంది. అదే గనుక చేస్తే ప్రజలకు వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించగలుగుతారు. కూలడానికి సిద్ధంగా ఉన్న క్వార్టర్లను తొలగించి వాటి స్థానంలో కొత్తగా ఆసుపత్రికి అభివృద్ధికి అవసరమైన వాటిని ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజాప్రతినిధులు కాని, ఆసుపత్రి అభివృద్ధి కమిటి కాని స్పందించి వెంటనే శిథిలావస్థకు చేరుకున్న క్వార్టర్లను తొలగించి వాటి స్థానంలో కొత్త భవనాలను నిర్మించాలి. లేదా ఆసుపత్రికి అవసరమైన పరికరాలు ఇతరత్రా వాటిని ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గదులు నిర్మించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

క్వార్టర్లు నివాసయోగ్యంగా లేవు

ప్రస్తుతం ఆసుపత్రి క్వార్టర్‌లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి గురించి ఉన్నతాధికారులకు ఎన్నో సార్లు రాసి పంపాము. ఆర్అండ్‌బి వారు కూడా వచ్చి చూసి వెళ్ళారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని చెప్పారు. అయితే అందుకు ప్రభుత్వం సహకరించి ఆదేశాలు జారీ చేయాలి.



లింగన్న, సూపరింటెండెంట్

అందుబాటులోకి మిల్కింగ్ మిషన్లు

● 10నిమిషాల్లో 10 లీటర్ల పాలు పితకవచ్చు..

● నూతన టెక్నాలజీతో పాడి రైతులకు ఊరట

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమ రంగంలో మిల్కింగ్ మిషన్లు విరివిగా అందుబాటులోకి రావడంతో పాడిరైతులకు ఉపశమనం కలుగుతోంది. గతంలో ఒక్కో ఆవు నుంచి పాలు పితకాలంటే 20నిమిషాల నుంచి 30నిమిషాల దాకా సమయం పట్టేది. దీంతో రైతులకు ఎంతో శ్రమ కలగడమే కాకుండా, ఎక్కువ పశువులను సాకడం ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం సులభపద్దతిలో పదినిమిషాల్లో పదిలీటర్ల పాలు పితికే యంత్రాలు అందుబాటులోకి రావడంతో పాడిరైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందువలన ఇతర పనులపై దృష్టిపెట్టడానికి వారికి వీలవుతోంది.

వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయిన రైతన్నలు ప్రస్తుతం పాడిపరిశ్రమవైపు మొగ్గు చూపుతున్నారు. రైతులు ఇతర రాష్ట్రాల నుంచి ఆవులను తెచ్చుకుని డెయిరీలను నిర్వహిస్తున్నారు. ఒక్కో ఆవు 8నుంచి 10లీటర్లు ఇస్తుండటంతో పాలు పితకడానికి మిషన్లను ఉపయోగించుకుంటున్నారు. పాలు పితికే మిల్కింగ్ యంత్రం రూ.25వేల



కోనాపురంలో మిల్కింగ్ యంత్రంతో పాలు పితుకుతున్న రైతు బాలాజీ

నుంచి రూ.45వేల దాకా ఉంటుందని రైతులు చెబుతున్నారు. పాడిరంగంలో నూతన టెక్నాలజీతో అందుబాటులోకి రావడంతో తమకు పని సులభమైందని రైతులు అంటున్నారు.

రైతు ఆత్మహత్యలు, వలసలను అరికట్టండి

● ప్రభుత్వానికి రైతు సంఘం నాయకుల డిమాండ్

పెనుకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రైతులపాలిట వ్యవసాయం శాపంగా మారడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వీటిని అరికట్టి రైతాంగాన్ని ఆదుకోవాలని జిల్లా రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆది



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం నాయకులు

వారం స్థానిక సీఐటీయు కార్యాలయం వద్ద ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్ని పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తూ చెరువులకు నీటిని సరఫరా చేయాలన్నారు. సెజ్ పేరుతో సేకరించిన పరిశ్రమలు ఏర్పాటు చేయని ప్రాంతాల్లో భూములను రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. పట్టు రైతుల ప్రోత్సాహక బకాయిలు రూ.72కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. పాడిరైతులకు గిట్టుబాటు ధరలు, ఇన్సురెన్స్ అమలు చేయాలని పదిరూపాయలు ప్రోత్సాహకం ఇవ్వాలన్నారు. పండ్లతోటల రైతులకు గిట్టుబాటు ధరలు, మార్కెట్ సౌకర్యం, జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాట్లు చేయాలన్నారు. పెన్నా పరివాహక ప్రాంతాలను ఇసుక యథేచ్చగా తోడేస్తున్నారని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సీఐటీయు నాయకులు బాబావలి, తిప్పన్న, వెంకటరాముడు, బూతప్ప, తదితరులు పాల్గొన్నారు.

వినికిడిలోపం ఉన్న వారికి ఉచిత స్క్రీనింగ్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం ఉన్న పిల్లలకు హిందూపురం ఐఎంఏ ఆధ్వర్యంలో ఉచిత స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ ప్రతినిధులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఐఎంఏ హాల్‌లో వినికిడి లోపం ఉన్న పిల్లలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారు. ఇందు కోసం ప్రముఖ ఈ అండ్ టి, బెంగళూరు వైద్య నిపుణులు డాక్టర్ సుషీన్‌దత్, సీనియర్ కన్సల్టెంట్, కాక్లియర్ ఇంప్లాంట్ అండ్ స్కల్‌బేస్ సర్జన్ ఫోర్టిస్ హాస్పిటల్ బన్నేరుఘట్ట వైద్య నిపుణులు, సిబ్బంది విచ్చేయనున్నారు. అవసరం ఉన్న వారు 8050097007ను సంప్రదించాలన్నారు.

ఏపీపీఈఈఓఏ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సృజన్‌బాబు



ఉపాధ్యక్షుడిగా ఎంపికైన సృజన్‌బాబును అభినందిస్తున్న ఎస్ఐలు

పెనుకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ల అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా పెనుకొండ ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం అనంతపురం ఎక్సైజ్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో సీఐ సృజన్‌బాబును ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఆయనకు స్థానిక ఎక్సైజ్ ఎస్ఐలు రాజశేఖర్, జీజీ రాముడు, కార్యాలయం సిబ్బంది పూలమాలలువేసి శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన మైలార లింగేశ్వర స్వామి మహోత్సవం

అగళి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అగళి మండలం మధుడి గ్రామంలో గత రెండు రోజులుగా మైలార లింగేశ్వరస్వామి 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో గురు లింగప్ప, తిప్పేస్వామి, భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును ఆదివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతిలో జరిగిన రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ కుమారుడి వివాహ వేడుకలకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి చంద్రబాబును కలిసి నియోజకవర్గంలోని పలు సమస్యలపై చర్చించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మడకశిర నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఇచ్చిన హామీల అమలు తీరు గురించి వివరించినట్లు తెలిపారు.

సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన శ్రీహెంజేరు సిద్దేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీవారు తెలిపారు. ఉదయకాలమే పంచామృతాభిషేకం నిర్వహించారు. సిద్దేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించి వెండి కవచములు ధరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు మహా మంగళ హారతి, తీర్థప్రసాదాన్ని పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, ప్రదాన అర్చకులు సిద్దలింగేశ్వర, శివకుమార్‌స్వామి, రవిశంకర్, గౌతమ్, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

మడకశిర రూరల్ ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డి నాగరాజునాయక్,సర్పంచు గంగమ్మ, క్లష్టర్ ఇన్‌చార్జ్ నాగరాజ పేర్కొన్నారు. మండలంలోని కల్లుమర్రి పంచాయితీ కేంద్రంలో ఆదివారం పరిసరాల పరిశుభ్రతపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయితీ సిబ్బంది రోజు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి చెత్త సేకరిస్తారన్నారు అందులో భాగంగా ఆదివారం గ్రామంలో ఇంటింటికి వెళ్ళి చెత్త సేకరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పావగడ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): విడిగేసి పోలీస్ స్టేషన్ పరిధిలో బెడత్తూరు దగ్గర ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ జేడీఎస్ నాయకుడు శివప్ప నాయక్ కారు ప్రమాదానికి గురై అందులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. శివప్పనాయక్ పెద్దకుమారుడి పెళ్లి మధుగిరిలో ఆదివారం జరిగింది. ఆయన కార్యక్రమాన్ని ముగించుకుని సాయంత్రం పావగడకు వస్తున్న సమయంలో బెడతూరు దగ్గర కారు అదుపుతప్పి నీటి ట్యాంకును ఢీకొంది. అందులోబడి పెళ్లికొడుకు పెద్దమ్మ మృతిచెందగా నాయక్ భార్యకు మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికుల సహాయంతో మధుగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్సకోసం తుమకూరుకు తరలించినట్లు విడిగేసి పోలీసులు తెలిపారు.

న్యూస్ బాక్స్

కాళికాకమతేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కాళికాంబ కమతేశ్వరస్వామి

రొళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రత్నగిరిలో వెలిసిన కాళికాదేవి కమతేశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రంగు రంగులపూలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపించారు. అలాగే ప్రసిద్ధ ఆధ్యాత్మిక పర్యాటక మహాక్షేత్రం రత్నగిరిలో వెలిసిన శ్రీపార్శ్వనాథ తీర్థంకరుల దేవాలయంలో వార్షికపూజా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో స్వామివారి మూల విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం, రవాణా సౌకర్యాలు కల్పించారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి: ఎంపీడీఓ

పరిగి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు స్వచ్ఛత సేవ చేస్తూ గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించే కార్యక్రమంతోపాటు కొడిగెనహళ్లి, పురవీధుల్లో చెత్తను శుభ్రం చేశారు. గృహిణులు తడిచెత్త, పొడిచెత్త వేర్వేరుగా ఉంచితే చెత్తను సేకరించడానికి పంచాయతీ కార్మికులకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో ఉన్న మురుగు కాలువలో కాగితాలు, ప్లాస్టిక్, పడేయకుండా చెత్తకుండీలో వేయాలని సూచించారు.

కంది రైతుల అవస్థలు

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రొద్దం మండలం మరువపల్లివద్ద ఉన్న గోడౌన్ వద్ద కంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, రైతులు తెచ్చిన కందులను కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ కంది కొనుగోలు కేంద్రాలకు రైతులు కందులను విరివిగా తరలిస్తున్నారు. దీంతో గోడౌన్‌లు ఫుల్ అయి కొనుగోళ్ల ఆగిపోతున్నాయి. ఈ విషయంపై మార్క్‌ఫెడ్ డీఎం గీతను వివరణ కోరగా ఇటీవలే అనంతపురం, కణేకల్లు గోడౌన్‌లు కూడా ఫుల్ అయ్యాయన్నారు.

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

సోమందేపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాయి ఆసుపత్రిలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె, కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పరీక్షల అనంతరం పెద్దఎత్తున గ్రామానికి ప్రజలు తరలివచ్చారు. 20మందికి నిర్వహించిన పరీక్షల్లో ఆరుగురిని గుండె శస్త్ర చికిత్సల కోసం ఎంపిక చేయగా తొమ్మిది మందిని కంటి ఆపరేషన్లకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవేంద్ర, వైద్యురాలు మహేశ్వరి, కిమ్స్ సవేరా ఆసుపత్రి కార్డియాలజిస్ట్ సందీప్, వైద్య బృందం పాల్గొన్నారు.

పులేరులో పండ్లతోటలు దగ్ధం



కాలి పోయిన సపోటా తోట

గోరంట్ల, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు గ్రామంలో తన పండ్లతోట ఆదివారం దగ్ధం కావడంతో రూ.రెండులక్షలకుపైగా ఆస్తినష్టం జరిగిందని టీడీపీ మండల కన్వీనర్ సోముశేఖర్ తెలిపారు. ప్రమాదంలో నాలుగు ఎకరాల్లోని మూడువందల సపోటా, అర ఎకరాలోని 40 మామిడిచెట్లు, కాలిపోయినటు తెలిపారు. పండ్లచెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోవడంతో రూ. 50వేలు నష్టం జరిగిందన్నారు. పక్క పొలం వారు చెత్తకుప్పకు నిప్పు పెట్టడంతో, గాలి తీవ్రతకు పండ్లతోటవైపు మంటలు వచ్చాయన్నారు. గాలి తీవ్రంగా ఉండడంతో ఆర్పడానికి రైతులు శ్రమించినా, ఫలితం రాలేదన్నారు. సమీపంలోని రైతు రాజశేఖర్ వేరుశనగ పొలంలోని డ్రిప్ పరికరాలు, స్టార్టర్ కూడా కాలిపోయాయన్నారు. అగ్నిమాపక యంత్రం కోసం ప్రయత్నించగా, పుట్టపర్తి నుంచి వారు మధ్యాహ్నం వస్తామంటూ కాలయాపన చేశారన్నారు.

వైభవంగా వీరలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ

గోరంట్ల, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాగానిపల్లిలో మహారుద్రాభిషేకం, విగ్రహప్రతిష్ట వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన బూరుగు నారాయణప్ప, గ్రామప్రజల సౌకర్యార్థం నూతనంగా శ్రీవీరలింగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. గత మూడురోజులుగా పురోహితులు శేఖర్‌శర్మ ఆధ్వర్యంలో హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, మహారుద్రాభిషేకం, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు.

నడిరోడ్డుపై మురుగునీటితో ప్రజల ఇబ్బందులు



బుళ్ళసముద్రం ఎస్సీ కాలనీలో రోడ్డుపై మురుగునీరు

మడకశిర రూరల్ ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుళ్ళసముద్రం ఎస్సీ కాలనీలో నడిరోడ్డులో మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటి వల్ల దోమలు వ్యాప్తిచెందుతున్నాయి. సమీపంలోనే అంగన్‌వాడీ కేంద్రంకూడా ఉంది. అక్కడి ఈ మురుగునీటి వల్ల వాహన రాక పోకలకు కూడా ఇబ్బందిగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి రమేష్ స్పందిస్తూ డ్రైనేజీలు లేక పోవడంతో మురుగునీళ్లు రోడ్డుపై ప్రవహిస్తున్నాయని, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వైసీపీని వీడి టీడీపీలోకి 60 మంది..



పార్టీలో చేరిన వారితో మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు నచ్చడంతో ప్రజలు వైసీపీని వీడి టీడీపీలోకి పెద్దఎత్తున చేరుతున్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మంత్రి సవిత 60మందికి టీడీపీ కండువావేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పరిగి మండలం యర్రగుంట, నేతులపల్లి, తిరుమలదేవరపల్లి గ్రామ పంచాయతీల పరిధి నుంచి పలువురు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

గుడిబండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): హిందూపురం టౌన్ మేళాపురం కాలనీకి చెందిన ఇస్మాయిల్(28) అనే యువకుడు అగ్ని ప్రమాదానికి గురై ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ రాజకుల్లాయప్ప తెలిపారు. మేళాపురం కాలనీకి చెందిన ఇస్మాయిల్ అనే యువకుడు డిగ్రీ వరకు చదువుకున్నాడు. బెంగళూరులో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నానని తాత ఖాసీంబాషతో చెప్పి ద్విచక్ర వాహనంలో ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లాడు. 11వతేదీ రాత్రి గుడిబండ మండలం భూతప్ప కనుమలో ఉన్న దర్గా వద్ద నిద్రించాడు. దర్గా వద్ద చలి విపరీతం కావడంతో ద్విచక్ర వాహనంలో ఉన్న పెట్రోల్ తీసి మంటలో వేశాడు. దీంతో ఒక్కసారిగా అగ్ని మంటలు శరీరానికి పాకి బట్టలు, శరీరం కాలిపోయాయి. ఇస్మాయిల్ మెళవాయి గ్రామానికి చెందిన తన మిత్రుడికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించాడు. వెంటనే మిత్రుడు భూతప్ప కనుమ దర్గా వద్దకు వచ్చి గాయపడిన ఇస్మాయిల్‌ను మడకశిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. మెరుగైన వైద్య చికిత్స కోసం హిందూపురం, అనంతపురం, కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇస్మాయిల్ తాత ఖాసీంబాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లేపాక్షి ఆలయంపై నిపుణుల కమిటీని నియమించండి



వినతిపత్రం ఇస్తున్న మైనాస్వామి

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): లేపాక్షి వీరభద్రస్వామి ఆలయ సముదాయానికి యునెస్కో వారసత్వ కట్టడాల జాబితాలో శాశ్వత చోటు సంపాదించడానికి నిపుణుల కమిటీని నియమించాలని రాష్ట్ర సాంస్కృతిక వ్యవహారాలశాఖ సంచాలకుడు డాక్టర్ మల్లికార్జునకు వినతి పత్రం అందచేసినట్లు చరిత్రకారుడు మైనాస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయ సముదాయాన్ని యునెస్కో వారసత్వ కట్టడాల తాత్కాలిక జాబితాలో చేర్చినట్లు 2023 మార్చి 30న ప్రకటించిందన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆలయంలోని నిర్మాణ విశేషాలు, అత్యున్నత శిల్పసంపద, తైలవర్ణ చిత్రాలు, ప్రపంచంలోనే పెద్దదైన ఏకశిల రాతి నందివిగ్రహం వంటి విషయాలపై నివేదికను రూపొందించి సమర్పించాలని కోరినట్లు తెలిపారు.

ఇన్నాళ్లకు రోడ్డు గుర్తొచ్చిందా?

● వైసీపీ నేతలపై విమర్శల వెల్లువ



రోడ్డుపై మట్టి వేసి చదును చేయిస్తున్న వైసీపీ నాయకులు

గోరంట్ల, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులేరు నుంచి పేరుమాల్లపల్లికి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో వెంకటరమణపల్లి సర్పంచ్ అశ్వర్థరెడ్డి, వైసీపీ నాయకుడు సంపత్ సొంత నిధులతో మట్టి పూడ్చి రోడ్డును మరమ్మత్తు చేపట్టడం విమర్శలకు దారి తీసింది. పేరుమాల్లపల్లికి వెళ్లే రహదారి మూడు కిలోమీటర్లు మేర కంకర తేలి వాహనాల రాకపోలకుఅంతరాయం కలిగిస్తోంది. ఈ దారిని నిత్యం పులేరు ఉన్నతపాఠశాల విద్యార్థులు వచ్చి వెళ్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉన్న విషయాన్ని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు, నియోజకవర్గ సమన్వయకర్త ఉషాశ్రీచరణ్‌కు స్థానికులు వివరించడంతో ఆమె ఆదేశాల మేరకు అశ్వర్థరెడ్డి, సంపత్‌లు ఎక్స్‌కవేటర్‌ద్వారా రోడ్డుపై మట్టి వేసి, మరమ్మతులు చేశారు. ఈవిషయాన్ని ఫోటోలతో సహాయ సోషియల్ మీడియాలో వివరిస్తూ ప్రజలకు ఏకష్టమొచ్చినా తాము ముందుడి ప్రజల కష్టాలు తీర్చడానికి కష్టపడతామని ప్రకటించారు. దీంతో గత ఐదేళ్ల అధికారంలో ఉండగా గుర్తుకురాని రోడ్డు ఇప్పుడే గుర్తుకు వచ్చిందా అని పలువురు విమర్శిస్తున్నారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వాహనం పట్టివేత

హిందూపురం, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి):నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటక నుంచి ఆంధ్రకు డీజల్ తరలించే వాహనాన్ని హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ వాహనం ఆదివారం కర్ణాటక నుంచి తూమకుంట చెక్‌పోస్టు మీదుగా హిందూపురం వైపు వస్తుండగా అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ తనిఖీ చేసి దానిని స్టేషన్‌కు తరలించారు. కర్ణాటకకు, ఆంధ్రకు రూ.6నుంచి రూ.8 ధర వ్యత్యాసం ఉండటంతో కొంత మంది పెట్రోల్‌బంక్ నిర్వాహకులే అక్కడి నుంచి డీజల్ తీసుకొచ్చి ఇక్కడ సొమ్ము చేసుకుంటున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాన్ని వాణిజ్య పన్నులశాఖకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి23 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని 2వార్డులో నివాసముంటున్న తాజున్ అధిక సంఖ్యలో మాత్రలు మింగి ఆదివారం ఆత్మహత్యకు యత్నించింది. కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఆమె ఇంటిలోని వివిధ రకాల మాత్రలు మింగి, అస్వస్థతకు లోనైంది. ఆమెను వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు వాహనంలో హిందూపురం తరలించారు.

రహదారి కోసం ఘర్షణ

గోరంట్ల, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టచిన్నంపల్లి గ్రామానికి చెందిన దాయాది కుటుంబాల మధ్య రహదారి విషయంలో ఆదివారం ఘర్షణ చెలరేగింది. అన్నదమ్ములైన సోమశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పొలాల్లోకి వెళ్లే రహదారి విషయంలో చిన్నప్పరెడ్డితో వివాదం ఏర్పడింది. ఆ దోవన వెళ్లడానికి చిన్నప్పరెడ్డి అభ్యంతరం తెలపడంతో వారి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. చిన్నప్పరెడ్డి కొడవలితో వారిపై దాడిచేయగా సోమశేఖర్‌రెడ్డి తలకు, చంద్రశేఖర్‌రెడ్డి కుడిచేతి వేళ్లకు తీవ్రగాయాలయ్యాయి. వారిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ వినోద్‌కుమార్ చికిత్స చేసి, పోలీస్‌లకు సమాచారం అందించారు. మెరుగైన వైద్యంకోసం హిందూపురం వెళ్లాలని సూచించారు.